# సమాధానం లేని ప్రశ్న

సుమలతది అసాధారణమైన అందం అని ఆడవాళ్ళైనా కళ్లు మూసుకుని అంగీకరించవలసిందే. పాలరాతి శిల్పంలా మెరిసిపోయే కళ్ళుచెదిరే ఆ అందాన్ని, ఆ అందానికి వెనక కాస్తో, కూస్తో ఉన్న ఆస్తిని చూసి ఆనందరావు ఆమెను తన సొంతం చేసుకున్నాడు. అందానికి తోడుగా, అహంకారం జీర్ణించుకున్న సుమలత సహజంగా మగవాడిగా ఆనందరావు తనమీద సాగించే అధికారాన్ని ఆనందంగా స్వీకరించలేక పోయింది.

ఒకసారేదో సందర్భంలో ఎదురు తిరిగి ఇష్టం వచ్చినట్లు మాట్లాడిన సుమలతను ఆనందరావు ఎడా పెడా రెండు చెంపలూ వాయించాడు. సుమలతలో రోషం, అవమానం పోటీపడ్డై. ఆనందరావు పద్ధతి ఆమెకేమాత్రం నచ్చలేదు. ఆమెలోని స్వతంత్ర భావాలు జండా ఎగరవేసినై. అప్పటికి ఆనందరావువల్ల పుట్టిన పసికందుకు సంవత్సరం నిండింది. సుమలత అతనికి విడాకులిచ్చే ప్రయత్నంలో పడింది. ఆనందరావు బతిమాలినా, ఏం చేసినా ఆమె రాజీకి రాలేదు. డబ్బు గుప్పించి తొందరలోనే విడాకులు సాధించింది.

ఇంటి దగ్గరున్న గుడికి రోజూ వెళ్ళి వస్తుంది సుమలత. అక్కడే వినయ్‌కుమార్ ఆమెను చూసి మోహించాడు. ఆమె అందానికి దాసోహమన్నాడు. ఆమె కథ తెలిసినా పెళ్ళి చేసుకుంటానని ముందుకు

వచ్చాడు. అనడమేమిటి ఓ శుభముహూర్తాన పెళ్ళి చేసుకున్నాడు, కూడా! మగవాడు విచ్చల విడిగా తిరగొచ్చు-ఎన్ని పెళ్ళిళ్ళైనా చేసుకోవచ్చు. కానీ సమాజం ఎంత మారిందన్నా ఆడవాళ్ళకి అంత స్వేచ్ఛ ఉందా? అసలు ఇష్టం లేకుండా ఏ మొగుడితోనైనా ఎందుకు కాపురం చెయ్యాలి? ఇదే ఉద్దేశంతో ఆనందరావు తరువాత వినయ్‌ని తన జీవితంలోకి ఆహ్వానించిందామె. వినయ్ మంచివాడే-సుమలత అంటే ప్రేమ ఉంది. అయితే నగలు కావాలని, కారు కావాలనీ అతని శక్తికిమించిన కోరికలు కోరినప్పుడు వినయ్ నిస్సహాయంగా ఊరుకుండిపోయాడు. ఆమెకు నచ్చచెప్పడానికి ప్రయత్నించాడు. కానీ, చిత్రమైన మనస్తత్వం ఉన్న సుమలత క్రమంగా అతని పట్లకూడా ద్వేషం పెంచుకుంది. ఈసారి కూడా సుమలత పట్టుదల నెగ్గింది. విడాకులు ఆ ఇద్దర్నీ కూడా దూరం చేసినై.

ఇప్పుడు పసివాడు ప్రదీప్‌కి అయిదుసంవత్సరాలు కూడా దాటినై కొన్నాళ్లు సుమలత ఒంటరిగానే ఉంది. కానీ, ఎంతో కాలం కాకుండానే విశ్వనాథం అనే కోటీశ్వరుడు సుమలతను కోరాడు. ఆమెను విదేశాలకు తీసుకువెళ్తానని ప్రామిస్ చేసి పెళ్ళితో తనదాన్ని చేసుకున్నాడు. సంసారం సాగిపోతోంది. అయితే విదేశాలకు అతను తీసుకువెళ్తానన్న గడువు దాటాక కూడా చాలా కాలం ఓపిక పట్టింది సుమలత. విశ్వనాథానికి లక్షల బిజినెస్-లావాదేవీలు-అందువల్ల అతని ప్రయత్నం కొంత వాయిదా పడింది. మళ్ళీ సుమలతలో అసంతృప్తి బయలు దేరింది.

తనను అర్థం చేసుకోమని విశ్వనాథం సుమలతను బతిమాలుతు

న్నాడు. కానీ, పట్టు వదలకుండా ఆమె విడాకుల కాగితంమీద సంతకం పెట్టమని అతనితో వాదిస్తోంది. "సుమా! ఎందుకంత ఆవేశం తెచ్చుకుంటావ్? ఉట్టి మనిషివి కూడా కాదంటూ" ఆమెకు నచ్చచెప్పే ప్రయత్నంలో ఉన్నాడతను. పక్కనే ప్రదీప్ ఉన్నాడు.

"నాన్నా! అమ్మ పేలేంతి" అన్నాడు వాడు హఠాత్తుగా.

"నువ్వే చెప్పు" అన్నాడు విశ్వనాథం ప్రదీప్ బుగ్గలు పుణికి. "సుమలత" అన్నాడు వాడు వచ్చీరాని మాటలతో "గుడ్.... ఇప్పుడు నాన్న పేరు చెప్పు" అన్నాడు విశ్వనాథం.

"నాన్న పేరేంటి?" అంటూ మళ్ళీ తల్లిని ఎదురు ప్రశ్న వేశాడు ప్రదీప్. "విశ్వనాథం" అన్నాడు నవ్వుతూ విశ్వనాథం.

"ఊఁహుఁ కాదు-ఆనందలావుత. పక్క ఆంటీ చెప్పింది" అన్నాడు కళ్లుతిప్పుతూ వాడు. అన్యమనస్కంగా ఉన్న విశ్వనాథం ఉలిక్కిపడ్డాడు. సుమలతకు ఏదో ఒక రకమైన బాధ- కడుపులో తిప్పేసినట్లైంది. ఆ పసిమనునకు ఈగొడవలు, చికాకులూ ఏం తెలుసు? తల్లి ఒకర్తే అయినా తండ్రులు మారారన్న సంగతి తెలియదుగా! సుమలత కళ్ళల్లో చివ్వున నీళ్ళు చిమ్మినై. ఎంత సేపూ తన గురించే ఆలోచించుకుంది. కానీ, ఎదిగే పసిమనసును గురించిన ఇంగితంలేకపోయింది. ప్రదీప్ మాటలు ఆమె జీవితానికి పరిష్కారమయినై. మరు నిమిషం సుమలత చేతిలోని విడాకుల కాగితం ముక్కలుముక్కలై గాల్లోకి ఎగిరిపోయింది.

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 16-7-86)